క్లుప్తంగా

అల్లీపూర్‌కు చేరిన శ్రీరాముని అక్షింతలు



అక్షింతలతో మహిళలు, గ్రామస్తులు

రాయికల్: అయోధ్య రాములవారి అక్షింతలు ఆదివారం మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చేరాయి. ఈ సందర్భంగా మహిళలు వివిధ పార్టీల నాయకులు గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి గ్రామంలోని హనుమాన్, శివాలయంలోకి అక్షింతలు తీసుకెళ్లారు. అనంతరం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, బీజేపీ నాయకులు బాలే శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఆదివారం పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌లో విధులు నిర్వహించే ఆటో డ్రైవర్లు నంది చౌరస్తా వద్ద పబ్లిక్ టాయిలెట్లను శుభ్రపరిచి ప్రజలకు అవగాహన కల్పించారు. బహిరంగ రహిత మల, మూత్ర విసర్జన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, అధికారులు మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం



విరాళం ఇస్తున్న దాత జ్ఞానమ్మ

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని శివ గాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి దాత భోనగిరి జ్ఞానమ్మ రూ.15 వేల విరాళాన్ని ఆదివారం ఆశ్రమ నిర్వాహకుడు సూరజ్ శివ శంకర్‌కు అందజేశారు. అమెరికాలో నివాసముంటున్న కూతురు అపర్ణ జన్మదినోత్సవం సందర్భంగా తల్లి భోనగిరి జ్ఞానమ్మ ఆశ్రమాన్ని సందర్శించి విరాళం అందజేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భోనగిరి నరేష్, ఆశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



విద్యార్థినిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రణీత

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో ఆదివారం జగిత్యాల సాయిరాం న్యూరో పిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు డాక్టర్ సాయి ప్రణీత ఆధ్వర్యంలో వంద మంది చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, నాయకులు రాజేందర్, సుధీర్, నామని శేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ



అదుపుతప్పి దూసుకెళ్లిన లారీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలో ఓ లారీ అదుపుతప్పింది. ఆదివారం తెల్లవారుజామున వెల్లుల-జగ్గాసాగర్ గ్రామాల మధ్యలో దర్గా పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అక్కడున్న దర్గా గోడలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో రహదారికిరువైపులా వాహనాలేమి రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టింపేది?

- సూచిక,హెచ్చరిక బోర్డులు కరువు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపక్క ఇంట్లోకి దూసుకుపోయిన వ్యాన్



వెల్లుల-రాంచంద్రంపేట మధ్య ప్రమాదకరంగా మూలమలుపు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని పలు చోట్ల మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద ప్రమాద సూచిక, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఆయా మార్గాల గుండా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళలో వెళ్లే వారు మరింత ఇబ్బంది పడుతున్నారు.

మలుపులు తెలియక తికమక

మూలమలుపులతో ఏ క్షణం ఏమౌతుందోనన్న భయంతో వాహనదారులు వెళ్తున్నారు.మెట్‌పల్లి మండలంలో పలు చోట్ల ఉన్న మూలమలుపులతో ఆందోళన వ్యక్తమౌతుంది. వెల్లులలో, రాంచంద్రంపేట-వెల్లుల మధ్యలో, వెల్లుల-జగ్గాసాగర్ మధ్యలో దొంగలమర్రి వద్ద, విట్టంపేటకు వెళ్లే దారిలో కెనాల్ వద్ద, ఆత్మకూర్ వెళ్లే దారిలో, మేడిపల్లి,వేంపేట,పెద్దాపూర్,కోనరావుపేట వెళ్లే ప్రధాన రహదారుల వద్ద మూలమలుపులు ఉన్నాయి. కాగా వీటి వద్ద ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతో మలుపులు తెలియక ప్రజలు తికమకపడుతున్నారు.

చోటుచేసుకుంటున్న ప్రమాదాలు..

కొన్నిరోజుల క్రితం మెట్‌పల్లి మండలం వెల్లుల-రాంచంద్రంపేట మధ్యలో మూలమలుపు వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. ధాన్యం లోడుతో వెళ్తున్న ఓ ఐచర్ వ్యాన్ ఒకరి ఇంట్లోకి దూసుకెళ్లగా ఇంటి గోడ పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇదేకాకుండా వేరే మూలమలుపుల వద్ద కూడా గతంలో ప్రమాదాలు జరిగాయి. రాత్రి సమయంలో మూలమలుపులతో ప్రజలు మరింత ఇబ్బంది పడుతున్నారు. కానీ అధికారులు చర్యలు తీసుకోలేదు.అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మూలమలుపులతో వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడెక్కడ మలుపులు ఉన్నాయో వాటిని గుర్తించి ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. – ముదాం హరీశ్, జగ్గాసాగర్

రాత్రి వేళల్లో ఇబ్బందులు



మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో వెళ్లే సమయంలో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దగ్గరకు వచ్చే దాకా మూలమలుపులు ఉన్నట్లు తెలియడంలేదు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– బండ శ్రీనివాస్,ఆత్మకూర్

మేరు కులస్తుల అభివృద్ధికి సహకారం



ఎమ్మెల్సీ జీవన్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న మేరు సంఘం సభ్యులు

జగిత్యాలటౌన్: మేరు కులస్తుల అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. జగిత్యాల పట్టణంలోని మేరు సంఘం సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను మేరు సంఘం సభ్యులు సత్కరించారు. తమ కులస్తులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామని, అలాగే మేరు కులస్తుల అభివృద్ధికి తన వంతు సాయం అందిస్తానని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ టీఆర్‌నగర్‌లో వివిధ కుల సంఘాలకు స్థలం మంజూరు కోసం ప్రపోజల్స్ ఇచ్చామని, మేరు సంఘానికి కూడా ప్రభుత్వం ద్వారా స్థలం మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి లావణ్య, ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, గట్ల రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కథలాపూర్: మండలంలోని చింతకుంట శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. పోలీస్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా... ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో పట్టుకున్నామన్నారు. ట్రాక్టర్ యజమాని శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

మేడిపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసిన ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శోభాయాత్రకు తరలిరావాలి

మెట్‌పల్లి: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో పూజలందుకుని వచ్చిన అక్షింతల ఎదుర్కొలు శోభాయాత్ర కార్యక్రమం పట్టణంలో సోమవారం ఉంటుందని ఆర్గనైజర్లు ఆర్మూర్ పోచయ్య, పోహార్ తుక్కారాం, మర్రి భాస్కర్ తెలిపారు. స్థానిక వెంకటేశ్వరాలయం నుంచి ఎస్సారెస్పీ క్యాంపులో ఉన్న రామాలయం వరకు శోభాయాత్ర ఉంటుందని, దీనికి హిందువులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

డబ్బులు అందజేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని బర్దిపూర్‌లో తిరుమని లక్ష్మి స్త్రీ నిధి రుణం రూ.30 వేలు తీసుకుంది. చివరి కిస్తీ కట్టే ముందు తిరుమని లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలు తిరుమని లక్ష్మి తీసుకున్న రుణం రూ.30 వేలు వాపస్ రావడంతో ఆదివారం సర్పంచ్ సంగం సాగర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసిన తొలగింపు ఉద్యోగులు

కథలాపూర్: గృహనిర్మాణశాఖలో పనిచేసి తొలగించిన ఉద్యోగులు ఆదివారం జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. గృహనిర్మాణశాఖలో 2006 సంవత్సరం నుంచి 2016 వరకు పనిచేయగా.. అకారణంగా అప్పట్లో తొలగించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతినిధులను కలిసి విన్నవించగా పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, తమ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు గంగరాజం, సభ్యులు దీకొండ రాజు, సాయికృష్ణ, హకీమ్, విజయ్, అంజనేయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

రాయికల్: మండలంలోని రామాజీపేటకు చెందిన ద్యాగ లచ్చన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట నాయకులు గోపి రాజరెడ్డి, మహేందర్‌గౌడ్, బేతి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ప్రార్థనా మందిరాలు ముస్తాబు



విద్యుత్ వెలుగుల్లో భూషణరావుపేట చర్చి

కథలాపూర్: మండలంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిల్లో ఆదివారం ప్రత్యేక అలంకరణలు చేశారు. మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, తాండ్ర్యాల గ్రామాల్లోని చర్చీలను క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. దీనిలో భాగంగా చర్చిలను సుందరంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ సందర్భంగా గత కొద్ది రోజులుగా ప్రతి ఆదివారం భక్తి శ్రద్ధలతో చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ పునరుద్ధరణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని కమ్మునూర్, రేకులపల్లి గ్రామాల్లో ఎత్తిపోతల పథకాలకు ఆదివారం విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ ఇచ్చారు. రేకులపల్లి, కమ్మునూర్ ఎత్తిపోతల పథకాలు రెండేళ్ల క్రితం గోదావరి ఉప్పొంగడంతో పాటు, ఎగువన ఉన్న రోల్లవాగు ప్రాజెక్టు తెగి ఎత్తిపోతల పథకాలు కొట్టుకుపోయాయి. దీంతో గత ప్రభుత్వం నిధులు వెచ్చించగా, పనుల జాప్యంపై రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించి పనులను వేగవంతం చేసి, ఈ యాసంగికి నీరందించాలని కోరారు. స్పందించిన నీటిపారుదల శాఖ డీఈ చక్రూనాయక్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తమ సిబ్బందితో శ్రమించి 400 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి, ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకువచ్చారు. కాగా రెండు రోజుల్లో వీటి ద్వారా సాగునీరు అందిస్తామని డీఈ వెల్లడించారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చిన అధికారులు

క్రికెట్ విజేత కోరుట్ల డాక్టర్స్ టీం

కోరుట్ల రూరల్: నిత్యం పేషెంట్ల బాగోగులు చూస్తూ ఆరోగ్య పరిరక్షణలో తల మునకలై ఉండే డాక్టర్లు ఆదివారం కాస్త ఆట విడుపు కోసం క్రికెట్ ఆడారు. దీనికి మండలంలోని కల్లూరులోని అక్షర స్కూల్ ప్లే గ్రౌండ్ వేదికైంది. కోరుట్ల-మెట్‌పల్లి పట్టణాలకు చెందిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు 40 మంది రెండు జట్లుగా ఏర్పడి క్రికెట్ టోర్నీ ఆడారు. ఈ టోర్నీలో కోరుట్ల వైద్యుల జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన కోరుట్ల జట్టుకు అక్షర స్కూల్ అధినేత సిద్దార్థ, సర్పంచ్ వంతడుపుల అంజయ్య కప్‌ను అందేశారు. కార్యక్రమంలో ఐఎంఏ నాయకులు డాక్టర్ అనూప్ రావు, రవి కిరణ్, జగదీశ్వర్, రేగొండ రాజేష్, గంగా సాగర్, అమరేశ్వర్,ఐఎంఏ సభ్యులు పాల్గొన్నారు.



కప్ అందుకుంటున్న విన్నర్ టీం

పెరియార్ రామస్వామికి నివాళి



నివాళి అర్పిస్తున్న నరేశ్, నాయకులు

పెగడపల్లి: పెరియార్ రామస్వామి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ల్యాగలమర్రిలో ఆదివారం భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటేటి నరేశ్ తదితరులు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. శాస్త్రీయ ఆలోచన, కులమతాలు మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం పెరియార్ రామస్వామిని కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు లింగయ్య, జగన్, రాజు, సత్యం, కనుకయ్య, అనిల్, తిరుపతి, అంజి, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ధర్మారస్వామి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతిమోహన్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమూరి లత, అర్చకులు చక్రపాణి మాదవచారి,సత్యనారాయణ, నవీన్ చార్యులు, దివాకరచార్యులు, రవీందర్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గుంటి పెరుమాండ్ల కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల: పట్టణ శివారులోని గుండి పెరుమాండ్ల ఆలయంలో పద్మావతి,అలివేలు మంగ సహిత గుంటి పెరుమాండ్ల కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో పుణ్యాహవచనం, నవగ్రహ, వాస్తు, సర్వతో భద్రమండల రచన, ఫలామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విశేష తులసి అర్చన వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీతాంబర్, చింత సురేశ్, తిరుక్కోవెల ప్రవీణ్, యెన్నమనేని రాజేందర్ రావు-మంజుల, రాంచందర్ రావు-లత,ప్రసాద్, అర్చకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి శంఖు, చక్రాలు వితరణ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రానికి చెందిన గంటా జాహ్నవి హైదరాబాద్‌లో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం రూ.18 వేల విలువగల వెండి శంఖు చక్రాలను ఆదివారం ఆలయ ఆర్చకులు సత్యనారాయణకు అందజేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు టికెట్ ఇవ్వాలి

ధర్మపురి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి నుంచి మాదిగలకు టికెట్ కేటాయించాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మెడపట్ల దుబ్బయ్య డిమాండ్ చేశారు. ధర్మపురి హరిత హోటల్‌లో ఆదివారం నిర్వహించిన మాదిగ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెద్దపెల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఎస్సీల జనాభాలో 75 శాతం మాదిగ కులస్తులు ఉన్నారని, అందుకే రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన ఎక్కువ ఓటర్లు ఉన్న మాదిగలకు టికెట్ కేటాయించాలని కోరారు. పార్లమెంట్ పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండి నిత్యం ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, ప్రజలతో సత్సంబందాలున్న వక్తులను గుర్తించి టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ నాయకులు కొల్లూరి రవికుమార్, కల్లెపెల్లి విక్రమ్, జిల్లపెల్లి దుర్గాప్రసాద్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడపట్ల దుబ్బయ్య

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మెట్‌పల్లి: పట్టణంలోని వాసవీ హైస్కూల్‌లో 2003–04 పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక నరేందర్ రెడ్డి గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువులు చెప్పిన గురువులను సన్మానించారు. సమ్మేళనం ఏర్పాటు పట్ల సంతోషం వ్యక్తం చేసి ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో మంత్రి గంగాధర్, అరుణ్‌కుమార్, రాకేశ్, మహేశ్, విజయలక్ష్మి, అనిత, సునీత, సరిత పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



ఎగ్గలకుంటలో ప్రమాదకరంగా మూలమలుపు

పెగడపల్లి: మండల కేంద్రంలోని ఎగ్గలకుంట ప్రాంతంలో మూల మలుపుతో ఉన్న రహదారి ప్రమాదకరంగా ఉంది. మూల మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ మద్దులపల్లికి చెందిన ఓ యువకుడిని లారీ డీ కొట్టి మృతి చెందగా, వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్డు విస్తరించిన ఆర్ అండ్‌బీ అధికారులు మూల మలుపులు ఉన్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రాయికల్‌లో మహా పడిపూజ



పూజలు చేస్తున్న గురుస్వాములు

రాయికల్: పట్టణంలో నారికేళ గురుస్వామి కైరం సత్యం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు సత్యంశర్మ, సాయిసుధీర్‌శర్మల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు జరిపారు. అయ్యప్ప దీక్షపరులు చేసిన భజనలతో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. పడిపూజలో రాయికల్, మల్లాపూర్ మండలాలకు చెందిన స్వాములు పాల్గొన్నారు.